క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన పెంచలయ్య



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పెంచలయ్య, ఆయన కుమార్తెలు

కందుకూరు: గూడూరు సమీపంలో ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీ అధినేత డాక్టర్ వంకి పెంచలయ్య యాదవ్, తన ఇద్దరు కుమార్తెలు అరవింద, ఐశ్వర్య గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాను వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం మంత్రి సురేష్‌కు వినతి



మంత్రి సురేష్‌కు విన్నవిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ కోరారు. గురువారం తాడేపల్లిలో మంత్రి సురేష్‌ను చైర్మన్ అబ్దుల్ గఫార్ కలిసి వినతి పత్రం అందించారు. గఫార్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీలో ఇప్పటికే చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన బకాయిల గురించి మంత్రికి వివరించగా.. సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

10న వైఎస్సార్ ఆసరా



మాట్లాడుతున్న ఎంపీపీ అత్యాల జఫన్య

పీసీపల్లి: మండల పరిధిలో ఈ నెల 10న వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అత్యాల జఫన్య తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, బాస్కర్ రెడ్డి ఉన్నారు.

జాబ్‌కార్డుదారులకు పని కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీడీ

సింగరాయకొండ(టంగుటూరు): ప్రతి జాబ్‌కార్డుదారునికి ఉపాధి పని కల్పించాలని ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి సూచించారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సింగరాయకొండ, కొండపి మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి పనులు ప్రారంభించాలన్నారు. జాబ్‌కార్డు నమోదు కార్యక్రమం పూర్తిచేయాలన్నారు. ఉద్యానవన రైతులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు కూలీ మొత్తాన్ని చెల్లించాలన్నారు. ఏపీఓ సీహెచ్ సుధాకరరావు, మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం



సింగరాయకొండలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు



జరుగుమల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కావ్యశ్రీ

సింగరాయకొండ(టంగుటూరు): నులి పురుగులు చిన్నారుల ఎదుగుదలను, ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని వైద్యాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ఒకటి నుంచి 19 ఏళ్లలోపులోపు పిల్లల్లో నులిపురుగుల నివారణకు తప్పనిసరిగా ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ చైతన్యకృష్ణ, ఎంఈఓ శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసులు, డాక్టర్ లీనారాఫెల్, సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి: ఏడాది వయసు నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని వైద్యాధికారి డాక్టర్ కావ్యశ్రీ తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో అవగాహన పోస్టర్‌ను డాక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ తిరుపతమ్మ, హెచ్ఎస్ చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ పరిధిలోని పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ రవిబాబు గురువారం పరిశీలించారు. కరేడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. బూత్‌లలో వసతులను పరిశీలించారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట వీఆర్వో మోహన్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గుడ్లూరులో మాట్లాడుతున్న ఎంవీఐ రఫి

గుడ్లూరు: వాహనాలు నడిపే డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్కే ఎండీ రఫి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం వాహన డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు సంబంధించి అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండటంతో పాటు డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. గుడ్లూరు సర్కిల్ సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ప్రయాణంలో చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తుందన్నారు. ఎస్సై లక్ష్మణరావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రాజకీయమంటే సేవ



టంగుటూరులో యాత్ర-2 సినిమాను వీక్షిస్తున్న ఆదిమూలపు విశాల్, నాయకులు

- యాత్ర-2 సినిమా సందేశమదే..
- మంత్రి ఆదిమూలపు సురేష్ తనయుడు విశాల్

సింగరాయకొండ(టంగుటూరు): రాజకీయమంటే పొత్తులు, పదవులు, అవసరాలు కాకుండా సేవ అని యాత్ర-2 సినిమా సందేశమిచ్చిందని, ప్రతి సామాన్యుడు చూడదగిన మంచి చిత్రం యాత్ర-2 అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుమారుడు విశాల్ పేర్కొన్నారు. సినిమా రిలీజ్ సందర్భంగా సింగరాయకొండలోని శాంతి థియేటర్ వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ సిద్ధాంతాలను కళ్లకు కట్టినట్లు సినిమాలో చూపారని కొనియాడారు. సామాన్యుడికి సేవ చేయాలన్న సంకల్పంతోనే జగనన్న రాజకీయాలు చేస్తున్నారని, ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. జగనన్న సారథ్యంలో ప్రజా సేవ చేస్తున్న తన తండ్రి ఆదిమూలపు సురేష్‌ను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంభాషా, సాయికోటి, షేక్ అబిద్ ఆలీ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టంగుటూరు: టంగుటూరు శ్రీనివాస హాలులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో యాత్ర-2 సినిమాను ఆదిమూలపు విశాల్ వీక్షించారు. అభిమానుల కోసం మంత్రి ఆదిమూలపు సురేష్ నాలుగు షోలకు ఉచితంగా టికెట్లు అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, అనంతవరం గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి సుబ్బరాజు, మేదరమిట్ల భరత్‌రెడ్డి, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, వైఎస్సార్ టీఎఫ్ నాయకుడుసూదనగుంటవెంకటస్వామిపాల్గొన్నారు.

ట్యాబ్‌లతో డిజిటల్ విద్య



ఉప్పలపాడులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్, హెచ్ఎం

సీఎస్‌పురం (పామూరు): విద్యావ్యవస్థలో రోజురోజుకూ పెరుగుతున్న పోటీతత్వం, ఆధునిక పరిజ్ఞానం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను అందిస్తోందని వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండలంలోని ఉప్పలపాడు ఎంపీయూపీ పాఠశాలలో గురువారం హెచ్ఎం సయ్యద్ ఖాజారహమతుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బైజ్యూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ యంబటి ప్రవీణ్‌కుమార్, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, బసివి చంద్రశేఖర్, జేఎస్ ఆనంద్‌బాబు, ఎల్. ఆంథోని, డి.పున్నమ్మ, ఎలికా శ్రీనివాసులు, జి. చినమాలకొండయ్య, షేక్ బుడేసా పాల్గొన్నారు.

కనిగిరిలో ఏఆర్‌టీ సెంటర్ షురూ

- ఆస్పత్రి సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం



మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ కలాం

కనిగిరి రూరల్: దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తుల మందులు, చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఏఆర్‌టీ సెంటర్‌ను కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం వైద్యులకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ దీర్ఘ కాలిక, హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు చికిత్సలు, మందులు ఇతర సౌకర్యాల కోసం ఒంగోలు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేదన్నారు. కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు జోసఫ్, ప్రభా, ఐసీ టీసీ సెంటర్ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఎల్‌టీ మల్లికార్జున, నరసింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పాకలలో 'పల్లెపల్లెకు సురేష్ అన్న సిద్ధం'

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో ఈనెల 10వ తేదీ ఉదయం 7 గంటలకు పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేలం కేంద్రంలోనే పొగాకు విక్రయించాలి

జరుగుమల్లి: రైతులు సాగు చేసిన పొగాకు వేలం కేంద్రంలోనే అమ్మకాలు సాగించాలని టుబాకో బోర్డు గుంటూరు సెక్రటరీ దివి వేణుగోపాల్ సూచించారు. కొండపి పొగాకు బోర్డు పరిధిలోని నేతివారిపాలెం, జరుగుమల్లి మండల పరిధిలోని పైడిపాడు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో బోర్డు అధికారులు పర్యటించారు. పొగాకు బోర్డు సెక్రటరీ మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమ కొనుగోళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ పొగాకును కోల్డు స్టోరేజ్‌లో ఉంచేందుకు బోర్డు అనుమతి తీసుకోవాలని చెప్పారు. పొగాకు బోర్డులో అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణం పూర్తి



కంభ కనిగిర రహదారిలో పూర్తి చేసిన ఎర్రవాగు బ్రిడ్జీలు

హనుమంతునిపాడు: కంభ- కనిగిరి రహదారి డబల్ రోడ్డు పనులు జరుగుతుండగా.. కందుకూరు నుంచి వేములపాడు ఘాట్ రోడ్డు వరకు డబల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. కాగా కనిగిరి నుంచి వేములపాడు వరకు 23 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి ముందుగా చిన్న బ్రిడ్జిలు, కల్వర్టుల పనులు పూర్తి చేశారు. వేములపాడు వద్ద ఏనుగ మంద వాగు బ్రిడ్జి, హనుమంతునిపాడు వద్ద ఎర్రవాగు పెద్ద బ్రిడ్జీల పనులు కూడా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు.

కులగణన నూరు శాతం పూర్తి చేయాలి

హనుమంతునిపాడు: కులగణన సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. గురువారం ఆమె తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణన సర్వే ఈ నెల 12 వరకు పొడగించారన్నారు. 12 లోపు సర్వే నిర్వాహకులు నూరు శాతం పూర్తి చేయాలని.. ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయిందన్నారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శి రామక్రిష్టారెడ్డి ఉన్నారు.

75 మందికి యునాని పరీక్షలు



పరకొండపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విమల ప్రియదర్శిని

గుడ్లూరు: మండలంలోని పరకొండపాడులో యునాని వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న యునాని వైద్యాధికారి విమల ప్రియదర్శిని 75 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా యునాని వైద్య మందులను అందించారు. సిబ్బంది మల్లిఖార్జున, హర్షిత, శ్రీలత, శేషమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత



ప్యాడ్లు అందుకుంటున్న విద్యార్థులు

ఉలవపాడు: ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరీక్షలకు అవసరం అయిన ప్యాడ్లను అందించారు. మండల పరిధిలోని రామాయపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 65 మంది విద్యార్థులకు వీటిని అందించారు. పీడీ జీవన్ తనకుమార్తె రోహిత జీవన్ చేతుల మీదుగా వీటిని అందించారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు వితరణ

కందుకూరు రూరల్: కందుకూరు - కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో పట్టణానికి చెందిన దండే రమేష్-మంజుషల కుమార్తె ఆరాధ్య పుట్టిన రోజు వేడులకు నిర్వహించారు. దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. విద్యార్థులకు భోజనాలకు అవసరమైన సరుకులను అందజేశారు. కుటుంబ సభ్యులు గంట వెంకట్రావు, కె.హరిబాబు పాల్గొన్నారు.

నూరు పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయండి



వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కృష్ణబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా, చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిని నూరు పడకల వైద్యశాలగా అభివృద్ధి (అప్‌గ్రేడ్) చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ టి. కృష్ణబాబును మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ కోరారు. విజయవాడలోని సెక్రటరియేట్‌లో గురువారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి కమిషనర్ టి. కృష్ణ బాబును చైర్మన్ గఫార్ కలిసినట్లు చెప్పారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు 50 పడకల ఆస్పత్రి నుంచి 100 పడకల ఆస్పతిగా అప్ గ్రేడ్ చేయాలని సంబంధిత ఫైల్‌ను నివేదించినట్లు చెప్పారు. తక్షణం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని వైద్యశాఖ కమిషనర్ చెప్పారని తెలిపారు. అనంతరం కమిషనర్ కృష్ణబాబును ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్‌లు సన్మానించారు.

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం



వలేటివారిపాలెంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు

వలేటివారిపాలెం: మండలంలోని 15 గ్రామ సచివాలయాలు పరిధిలో జగనన్న కాలనీలకు కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. కూనిపాలెం సచివాలయం పరిధిలో 100 శాతం, వలేటివారిపాలెంలో 90 శాతం, అయ్యవారిపల్లి 85 శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు వీఆర్‌ఓలు మల్లేశ్వరి, నారయణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, డిజిటల్ అసిస్టెంట్ వర్మ తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

జరుగుమల్లి: మండల పరిధిలోని చతుకుపాడు ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులతోపాటు నేత్ర వైద్యులు పాల్గొంటారని, ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఓ ప్రకటనలో సూచించారు.

పామూరు: మండల కేంద్రమైన పామూరు 2వ సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఒకటో సచివాలయ భవనంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు డాక్టర్ దాసరి హరిబాబు తెలిపారు. వైద్యశిబిరాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

ఉలవపాడు: మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయకుమారి తెలిపారు. రెండో విడత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

వెలిగండ్ల తహసీల్దార్ బదిలీ

వెలిగండ్ల: ఇటీవలన వెలిగండ్ల మండలానికి వచ్చిన తహసీల్దార్ పి.హేమంతకుమార్ గురువారం బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా నుంచి వెలిగండ్ల మండలానికి తహసీల్దార్‌గా వచ్చి ఈ నెల 5న విధుల్లో చేరారు. ఆ శాఖ ఉన్నత అధికారులు తహసీల్దార్ హేమంత కుమార్‌ను కొత్తపట్నం బదిలీ చేశారు.